RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా

తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts

వరంగల్ | సంపుటి 2 | సంచిక 75 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | బుధవారం | 16.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా



తెలంగాణ అభివృద్ధిలో "ఆగా ఖాన్" భాగస్వామ్యం

- సీఎం రేవంత్ రెడ్డి

- విద్య, వైద్యం, పర్యాటక రంగాల్లో సహకారం అందించాలని సీఎం విజ్ఞప్తి.
- చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి పునరుద్ధరణకు ఫౌండేషన్ చేయూత కోరిన ప్రభుత్వం
- భారత్ ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ఆహ్వానం.
- డిసెంబర్‌లో జరిగే 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్‌కు సీఎం ఆహ్వానం



నిత్యం నిఘా, హైదరాబాద్ : భారత పర్యటనలో భాగంగా హైదరాబాద్ వచ్చిన ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-Vతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో మర్యాదపూర్వకంగా సమావేశమై, రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఫౌండేషన్ మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పనిచేయాలని, ముఖ్యంగా శాసనమండలి, కుతుబ్ షాహీ టూంబ్స్ పునరుద్ధరణ తరహాలోనే మూసీ పరివాహక ప్రాంతంలోని చారిత్రక సిటీ కాలేజ్, పాత ఉస్మానియా ఆసుపత్రి భవనాల పరిరక్షణలో తోడ్పాటునందించాలని కోరారు. మూసీ నది పునరుజ్జీవనం, నైట్ ఎకానమీ ప్రణాళికలతో పాటు 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నెట్-జీరో నగరంగా రూపుదిద్దుకుంటున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' విశేషాలను సీఎం వివరించగా, ప్రిన్స్ ఆగా ఖాన్ దీనిపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ప్రిన్స్ రహీమ్‌ను సీఎం ఆహ్వానించారు. ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని అధికారులు కోరిన ఈ సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్య సలహాదారు కె. రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు యోగితా రాణా, వాణీ ప్రసాద్ పాల్గొన్నారు.

పరస్పర సున్నితత్వం పాటించాలి

- జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ



- బ్రిక్స్ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ భేటీ
- పరస్పర గౌరవం, ప్రయోజనం, సున్నితత్వం అవసరమని మోదీ స్పష్టీకరణ
- భారత్ ఆందోళనలను జిన్‌పింగ్ దృష్టికి తీసుకెళ్లిన ప్రధానమంత్రి
- శత్రువులుగా కాదు, భాగస్వాములుగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చైనా వెల్లడి

2

నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు

- కేటీఆర్



- సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ముసుగులు ధరించిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్న కేటీఆర్
- పీఎస్ బయట, లోపల ఉన్న సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని డిమాండ్
- రేవంత్ పాలనతో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని మండిపాటు

2

తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక..
అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు



2

హైదరాబాద్‌లో విషాద ఘటన.. హాస్టల్ భవనంపై నుంచి దూకి టెక్కీ ఆత్మహత్య

నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనలో 23 ఏళ్ల యువకుడు తాను నివసిస్తున్న హాస్టల్ భవనం పైనుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన యశ్వంత్ (23) గచ్చిబౌలిలోని ఒక సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. వృత్తిరీత్యా పది రోజుల క్రితమే అతడు మాదాపూర్‌లోని ఒక కో-లివింగ్ హాస్టల్‌లో చేరాడు. మంగళవారం తనకు ఆరోగ్యం బాగాలేదని యశ్వంత్ హాస్టల్ సిబ్బందికి తెలిపినట్లు సమాచారం. ఆ తర్వాత కొద్దిసేపటికే అతడు భవనం పైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకేశాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన యశ్వంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, యశ్వంత్ ఆత్మహత్యకు దారి తీసిన కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు ఖరారు..
కస్టమర్లపై భారం లేదన్న ఎన్‌పీసీఐ

- రూ. 2,000 దాటిన మర్చంట్ పేమెంట్లపై 0.4 శాతం ఛార్జీ
- వినియోగదారులకు ఎలాంటి అదనపు భారం ఉండదు
- పీ2పీ, రూ. 2000 లోపు వ్యాపార చెల్లింపులు ఎండీఆర్ పరిధిలోకి రావు
- వ్యక్తిగత యూపీఐ లావాదేవీలు పూర్తిగా ఉచితం
- వ్యక్తిగత యూపీఐ లావాదేవీలు పూర్తిగా ఉచితం

2

కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ,

- మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనతోనే ఏఐసీసీ చర్య తీసుకుందని వెల్లడి
- పార్టీ హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని స్పష్టీకరణ
- సీఎం రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని వ్యాఖ్య
- ప్రభుత్వం, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడి

2

22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది

- రఘునందన్ రావు



- లక్షలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్నారన్న రఘునందన్ రావు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి సమాధానం దాటవేశారని విమర్శ
- కాంగ్రెస్ ప్రభుత్వం బురద చల్లే రాజకీయాలు చేస్తోందని మండిపాటు

నిత్యం నిఘా, న్యూఢిల్లీ : తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితా భూముల సమస్య తీవ్ర రూపం దాల్చిందని, దీనివల్ల లక్షలాది మంది సామాన్య ప్రజలు రిజిస్ట్రేషన్లు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో 22ఏ భూములపై స్పష్టమైన ...

2

ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం..
నిందితులను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు

- ఎర్రవల్లి కేసులో నిందితుల అరెస్టుపై హైకోర్టు బ్రేక్
- నిందితులకు నోటీసులు ఇచ్చి దర్యాప్తు చేయాలని ఆదేశం
- ఏడేళ్లలోపు శిక్ష వర్తించే కేసులపై పోలీసులను నిలదీసిన కోర్టు
- సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పాటించాలని స్పష్టీకరణ
- అరెస్టులపై పోలీసుల తీరును తప్పుబట్టిన హైకోర్టు



నిత్యం నిఘా, హైదరాబాద్ : ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదంలో తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయొద్దని ధర్మాసనం ఆదేశించింది. కేవలం నోటీసులు ఇచ్చి దర్యాప్తు కొనసాగించాలని పోలీసులకు స్పష్టం చేసింది. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్ల కింద కేసులు నమోదైనప్పుడు నిందితులను ఎలా అరెస్టు చేస్తారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని గుర్తుచేసింది. వాటిని పక్కనపెట్టి అరెస్టులకు ఎలా వెళతారని పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని హెచ్చరించింది. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న ఎర్రవల్లి ప్రాంతంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరసన .....

2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అల్లు అర్జున్ మామపై గచ్చిబౌలిలో కేసు నమోదు



నిత్యం నిఘా, హైదరాబాద్ : ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్ రెడ్డిపై హైదరాబాద్ లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరం లోని ఐటీ కారిడార్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో గల ఒక భూవివాదానికి సంబంధించి ఆయనపై క్రిమినల్ ఫిర్యాదు దాఖలైంది. నానక్‌రామ్‌గూడలోని 'మంత్రి కాస్మోస్' ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఈ మేరకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ రెడ్డి మరికొందరితో కలిసి తమ భవన ప్రాంగణంలోకి అక్రమంగా ప్రవేశించారని వారు ఆరోపించారు. గేట్ల తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడటమే కాకుండా, అడ్డుకోబోయిన సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, ఫోటోలను ఒక పెన్ డ్రైవ్‌లో నిక్షిప్తం చేసి, గచ్చిబౌలి పోలీసులకు సాక్ష్యంగా అందజేశారు. చంద్రశేఖర్ రెడ్డితో పాటు ఆయన అనుచరులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ ఫిర్యాదు ప్రతులను తెలంగాణ డీజీపీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, మాదాపూర్ డీసీపీ, గచ్చిబౌలి ఏసీపీలకు సైతం పంపారు. ఐటీ కారిడార్‌లోని తమ ఉద్యోగులకు, నివాసితులకు రక్షణ కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

22ఏ భూముల సమస్య తీవ్ర రూపం దాల్చింది
- రఘునందన్ రావు

మొదటిపేజీ తరువాయి.. చారిత్రాత్మక నిర్ణయం వస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కనీస సన్నాహాలు లేకుండా సభకు వచ్చి అరకొర సమాచారంతో సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కోటి ఎకరాలకు పైగా భూములను అడ్డగోలుగా 22ఏ జాబితాలో చేర్చిన అధికారులపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి ప్రతిపాదిస్తున్నట్లు, ఇప్పటివరకు తొలగించామంటున్న 47,440 ఎకరాల వివరాలు ఏ గ్రామంలో ఎక్కడున్నాయో బహిర్గతం చేయాలని, మిగిలిన భూములపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ హైకోర్టు సిట్టింగ్ జడ్జితో కూడిన ప్రత్యేక కమిటీని నియమించి ధరణి, భూభారతి లొసుగుల వల్ల నష్టపోయిన పేదలకు న్యాయం చేయాలని రఘునందన్ రావు కోరారు. ప్రజా సమస్యలపై నిలదీస్తే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ రేవంత్ సర్కార్ బురదజల్లే రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మొదటి కేబినెట్ సమావేశంలోనే భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎంపీ స్పష్టం చేశారు.

ఎర్రవల్లి పసుపు నీళ్ల వివాదం..
నిందితులను అరెస్ట్ చేయొద్దన్న హైకోర్టు

మొదటిపేజీ తరువాయి.. కార్యక్రమం తర్వాత ఈ వివాదం మొదలైంది. నిరసన జరిగిన ప్రాంతాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, స్థానికుల ఫిర్యాదులతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. నిందితులను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారిలో కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపిన ధర్మాసనం.. నిందితుల అరెస్టుపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి చర్యలను నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని పోలీసులను ఆదేశించింది.

యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీలు ఖరారు..
కస్టమర్లపై భారం లేదన్న ఎన్‌పీసీఐ

మొదటిపేజీ తరువాయి.. దేశవ్యాప్తంగా విస్తృతంగా వినియోగంలో ఉన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ప్రకటన చేసింది. వ్యాపారులకు చేసే చెల్లింపులపై కొన్ని రుసుములను ప్రవేశపెట్టినప్పటికీ, ఆ భారం వినియోగదారులపై పడదని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం కోట్లాది మంది యూపీఐ వినియోగదారులకు పెద్ద ఊరటనిస్తోంది. ఎన్‌పీసీఐ తాజా నిబంధనల ప్రకారం, వ్యాపార చెల్లింపులలో (మర్చంట్ పేమెంట్స్) రూ. 2,000 దాటిన లావాదేవీలపై 0.4 శాతం రుసుము వర్తిస్తుంది. అయితే, ఈ ఛార్జీని కస్టమర్ల నుంచి వసూలు చేయకుండా వ్యాపారులే భరించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ఈ రుసుము రూ. 300 మించకుండా పరిమితి విధించారు. దీనివల్ల సాధారణ వినియోగదారులు తమ జేబు నుంచి ఎలాంటి అదనపు మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదు. మొత్తం పీ2ఎం (పర్సన్ టు మర్చంట్) లావాదేవీల్లో 95 శాతానికి పైగా రూ. 2,000 లోపే ఉండటం వల్ల చిన్న వ్యాపారులపై కూడా ఎటువంటి ప్రభావం ఉండదని ఎన్‌పీసీఐ పేర్కొంది. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులు, వ్యాలెట్లతో పోలిస్తే సవరించిన ఈ యూపీఐ ఎండీఆర్ రుసుములు చాలా తక్కువని వెల్లడించింది. అదే సమయంలో రైల్వే, టెలికాం సేవలు, ఇన్సూరెన్స్, ఇంధనం వంటి కొన్ని ప్రత్యేక విభాగాల్లో రూ. 2,000 దాటిన యూపీఐ చెల్లింపులపై ఫ్లాట్‌గా రూ. 5 రుసుము వర్తిస్తుందని ఎన్‌పీసీఐ పేర్కొంది. ఈ ఛార్జీలను సైతం సంబంధిత వ్యాపారులు, సేవా సంస్థలే చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు, ఇద్దరు వ్యక్తుల మధ్య (పీ2పీ) లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవని, అవి ఎంత మొత్తమైనా యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని ఎన్‌పీసీఐ స్పష్టం చేసింది. ఈ కొత్త నిబంధనలు కేవలం మర్చంట్ పేమెంట్లకే పరిమితం కావడంతో సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగదు.

నా పీఆర్ఓ, పీఏపై 15 మంది గూండాలు దాడి చేశారు : కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో తన పీఆర్ఓ మహేశ్ మాణిక్య, పీఏ మహేందర్ రెడ్డిపై దాడి చేశారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారుల సమక్షంలోనే ముసుగులు ధరించిన 15 మంది గుండాలు లోపలికి చొరబడి పక్కా ప్రణాళికతో ఈ దాడికి పాల్పడ్డారని... రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ వైఫల్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ రౌడీ రాజ్యంలా మారిందని, అణచివేతకు తలొగ్గని ప్రతీ పౌరుడికీ భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులే ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ గేటు ఘటనకు సంబంధించి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి ఉన్నప్పటికీ, రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే విచారణ పేరుతో ఉదయాన్నే స్టేషన్‌కు పిలిపించి చీకటి పడే వరకు కాలయాపన చేసి ఈ కుట్రకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ గుండాలు ఈ దాడికి పాల్పడ్డారా? లేక పోలీసులే మఫ్టీలో ముసుగులు వేసుకుని వచ్చారా? అనే దానిపై నిజాలు బయటకు రావాలంటే తక్షణమే సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ ఫుటేజీని వెంటనే భద్రపరచాలని, గాయపడిన తన సిబ్బందికి రక్షణ కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని 'ఎక్స్' వేదికగా ట్యాగ్ చేస్తూ 'వెల్‌డన్ కాంగ్రెస్' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

పరస్పర సున్నితత్వం పాటించాలి
- జిన్‌పింగ్‌తో భేటీలో భారత్ ఆందోళనలు ప్రస్తావించిన ప్రధాని మోదీ

మొదటిపేజీ తరువాయి.. న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాలు పరస్పరం ఆందోళనలను అర్థం చేసుకుని, సున్నితత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోదీ ఉద్ఘాటించినట్లు భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ భేటీకి సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం మీడియాకు వివరించారు. "పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనం, పరస్పర సున్నితత్వం" అనే మూడు ప్రధాన సూత్రాల ప్రాతిపదికన ద్వైపాక్షిక సంబంధాలు ముందుకు సాగాలని ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడికి స్పష్టం చేశారని ఆయన తెలిపారు. భారత్‌కు ఉన్న కీలక ఆందోళనలను కూడా ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించినట్లు జైస్వాల్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ సమావేశంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పందిస్తూ, ఇరు దేశాలు పరస్పరం శత్రువులు కాదని, భాగస్వాములుగా కొనసాగాలనే ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. ఈ భేటీలో కుదిరిన అత్యంత కీలకమైన అంశం ఇదేనని ఆయన అభివర్ణించారు. సరిహద్దుల్లో శాంతి, సుస్థిరతలను కాపాడేందుకు ఇరువురు నేతలు అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. భారత్.. చైనాకు శత్రువు కాదని, ఒక భాగస్వామి అని ప్రధాని మోదీ పేర్కొన్నట్లు చైనా మీడియా కథనాలు వెల్లడించాయి. చైనాతో తమ విధానం ఏ ఇతర దేశం ప్రభావంతోనూ ముడిపడి ఉండదని మోదీ స్పష్టం చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. కాగా, 2027లో బ్రిక్స్ కూటమికి చైనా అధ్యక్షత వహించనుంది.

తెలుగు రాష్ట్రాలకు కేంద్రం భారీ కానుక..
- అదనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు

మొదటిపేజీ తరువాయి.. ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది. ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

కొండా సురేఖ బర్తరఫ్ బాధాకరమే.. కానీ, - మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి..

కొండా సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయడం బాధాకరమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. అయితే పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకే ఏఐసీసీ ఈ నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. పార్టీ నిర్దేశించిన హద్దులు దాటితే ఎంతటివారిపైనైనా చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. హైదరాబాద్‌లో మంగళవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఇటీవలి పరిణామాలపై మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయంతో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. ''పార్టీ క్రమశిక్షణే అత్యంత ప్రధానం. ఏఐసీసీ నిర్దేశించిన హద్దులు, పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు'' అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించుకోవాలని సూచించారు. విషయాలను బహిరంగంగా మాట్లాడి క్రమశిక్షణ ఉల్లంఘిస్తే అధిష్ఠానం ఉపేక్షించదని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డితో కలిసి ప్రజా సంక్షేమం విస్తరణ, తెలంగాణలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు. తమ మధ్య గ్యాప్ ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని కోరారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కార్యకర్తలకు సైతం పార్టీలో కీలక పదవులు దక్కుతున్నాయని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరినీ గుర్తిస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నేతలు, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు.

అంతరిక్షంలో అమెరికా ఆయుధాలు..
- తీవ్రంగా స్పందించిన చైనా

- అంతరిక్షంలో ఆయుధాలు మోహరించడంపై అమెరికాను తీవ్రంగా విమర్శించిన చైనా
- తమ వద్ద కక్ష్యలో ఆయుధాలు ఉన్నాయని అమెరికా అంగీకరించిన నేపథ్యంలో ఈ పరిణామం
- అంతరిక్షంలో సైనిక కార్యకలాపాలు ఆపాలని వాషింగ్టన్‌కు బీజింగ్ డిమాండ్
- స్పేస్‌లో ఆయుధ పోటీని తాము వ్యతిరేకిస్తున్నామని చైనా విదేశాంగ శాఖ స్పష్టం
- చైనా, రష్యాలు కూడా అంతరిక్ష ఆయుధాలను అభివృద్ధి చేస్తున్నాయని ఆందోళన

నిత్యం నిఘా, అంతర్జాతీయం :
అంతరిక్షంలో అమెరికా ఆయుధాలను మోహరించడాన్ని చైనా తీవ్రంగా ఖండించింది. అంతరిక్షంలో సైనిక కార్యకలాపాలను, ఆయుధ సమీకరణను తక్షణమే నిలిపివేయాలని వాషింగ్టన్‌ను డిమాండ్ చేసింది. ఈ మేరకు చైనా విదేశాంగ శాఖ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అంతరిక్షంలో తమ వద్ద "కక్ష్య నియంత్రణ ఆయుధాలు" ఉన్నాయని యూఎస్ ఎయిర్ ఫోర్స్ సెక్రటరీ ట్రాయ్ మీంక్ బహిరంగంగా అంగీకరించిన మరుసటి రోజే చైనా ఈ విధంగా స్పందించింది. తమ బలగాలపై జరిగే శత్రు దాడులను తిప్పికొట్టేందుకే ఈ ఆయుధాలను మోహరించినట్లు ఆయన వెల్లడించారు. అయితే, ఇవి ఎలాంటి ఆయుధాలు, వాటి సామర్థ్యాలేమిటనే వివరాలను మాత్రం ఆయన బహిర్గతం చేయలేదు. ఆ వివరాలు వెల్లడిస్తే వాటి వ్యూహాత్మక ప్రాధాన్యత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. "అంతరిక్షాన్ని కేవలం శాంతియుత ప్రయోజనాలకే వినియోగించాలి. దానిని యుద్ధ క్షేత్రంగా మార్చే ఏ ప్రయత్నాన్నైనా చైనా వ్యతిరేకిస్తుంది. స్పేస్‌లో ఆయుధ పోటీని మేం నిరోధిస్తాం. అమెరికా తన సైనిక కార్యకలాపాలను నిలిపివేసి, ప్రపంచ వ్యూహాత్మక స్థిరత్వాన్ని కాపాడాలి" అని చైనా తన ప్రకటనలో స్పష్టం చేసింది. 1967 నాటి అంతరిక్ష ఒప్పందం ప్రకారం రోదసిలో అణుబాంబులు వంటి సామూహిక విధ్వంసక ఆయుధాల వినియోగాన్ని నిషేధించారు. అయితే, ఉపగ్రహాలను అడ్డుకునే సంప్రదాయ ఆయుధాలపై ఎటువంటి నిషేధం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 'గోల్డెన్ డోమ్' మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌లో భాగంగానే ఈ సైనిక విస్తరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, చైనా, రష్యాలు కూడా ఇటువంటి కౌంటర్-స్పేస్ సామర్థ్యాలను అభివృద్ధి చేస్తుండటంతో, రోదసిలో కొత్త ఆయుధ పోటీ ప్రారంభమైందన్న ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

చాహత్ బాజ్ పాయ్ దిశలో హన్మకొండ అభివృద్ధి..!

పార్కింగ్, డ్రైనేజీ, తాగునీరు.. పర్యాటక రంగానికి భారీ ప్రణాళికలు



హనుమకొండ, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా) :

హన్మకొండ నగర రూపురేఖలు మార్చే దిశగా భారీ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. పెరుగుతున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం, చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలకు కొత్త హంగులు అద్దడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్మన్ ఐఏఎస్ చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో జిల్లా, నగర అభివృద్ధి ప్రణాళికలను ఆమె వెల్లడించారు.

అశోక హోటల్ ఎదురుగా మల్టీలెవల్ పార్కింగ్

హన్మకొండలో పార్కింగ్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్న నేపథ్యంలో దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు మల్టీలెవల్ కార్ పార్కింగ్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. అశోక హోటల్‌కు ఎదురుగా ఉన్న కుడా స్థలంలో ఈ నిర్మాణాన్ని చేపట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

పార్కింగ్ కోసం మాత్రమే స్థలాన్ని వినియోగించకుండా ముందు భాగంలో వాణిజ్య దుకాణాలను ఏర్పాటు చేసి లీజుకు ఇవ్వాలనే ఆలోచన ఉందన్నారు. దీనివల్ల ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉంటుందని వివరించారు. నగర పార్కింగ్ సమస్య పరిష్కారంతో పాటు వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఊతమిచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

హన్మకొండ చౌరస్తాకు కొత్త రూపు



హన్మకొండ చౌరస్తాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఆర్టీసీ బస్‌స్టేషన్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలను కలుపుకొని ప్లాజా తరహాలో అభివృద్ధి చేసే ప్రతిపాదనపై ఆర్టీసీ అధికారులతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా, వాణిజ్య వసతులు కల్పించడంతో పాటు చౌరస్తాకు ఆకర్షణీయమైన రూపం తీసుకురావడమే లక్ష్యమన్నారు. మల్టీలెవల్ పార్కింగ్, చౌరస్తా అభివృద్ధి పూర్తయితే ప్రధాన కూడలిలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని వివరించారు.

అండర్ డ్రైనేజీకి రూ.5 వేల కోట్ల ప్రాజెక్టు

హన్మకొండ, కాజీపేటతో పాటు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన పనులు ముందుకు సాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రాజెక్టుకు అవసరమైన భూముల గుర్తింపు ప్రక్రియలో భాగంగా ఇప్పటికే సుమారు 10 ఎకరాల భూమిని గుర్తించినట్లు చెప్పారు. వర్షపు నీరు, మురుగునీటి నిర్వహణకు దీర్ఘకాలిక పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, సంబంధిత అధికారులు పరిశీలన కొనసాగిస్తున్నారని చెప్పారు. భారీ వ్యయంతో కూడిన ఈ ప్రాజెక్టును దశలవారీగా అమలు చేయనున్నట్లు వివరించారు.

తాగునీటి వ్యవస్థకు రూ.500 కోట్లు

గ్రేటర్ వరంగల్ వాటర్ వర్క్స్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేసిందని చాహత్ బాజ్‌పేయి తెలిపారు. రాబోయే 30 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిధులతో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కొత్త పైపులైన్ల నిర్మాణం, పాత పైపులైన్ల మరమ్మతులు, నీటి సరఫరా వ్యవస్థ బలోపేతం, కొత్త నిర్మాణాలు, నీటి ట్యాంకులు, నీటి నిల్వ ప్రాంతాల ఏర్పాటు వంటి పనులకు నిధులు వినియోగించ నున్నట్లు వివరించారు. నగర భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలో ప్రారంభోత్సవం చేయనున్నట్లు చెప్పారు.

భద్రకాళి, వరంగల్ కోటకు పర్యాటక హంగులు

భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.90 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించిందని కలెక్టర్ తెలిపారు. ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంతో పాటు ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. భద్రకాళి బండ్ వద్ద రాతి నిర్మాణ పనుల కోసం రూ.19 కోట్లతో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అభివృద్ధి పనులను ఆయనకు చూపించే ఆలోచన ఉందన్నారు. వరంగల్ కోట చుట్టూ ఉన్న సుమారు నాలుగు



కిలోమీటర్ల రక్షణ కందకాన్ని పునరుద్ధరించి బోటింగ్ సదుపాయాలను ఏర్పాటు



చేస్తున్నట్లు తెలిపారు. ఖిలా వరంగల్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు కొనసాగుతున్నాయని, ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రపంచ బ్యాంకు సహకారం తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నగరంలో ముంపు సమస్యను తగ్గించేందుకు రక్షణ గోడలు, డ్రైనేజీలు, నాలాల అభివృద్ధి పనులు కూడా చేపడుతున్నట్లు తెలిపారు.

దేవునూరు గుట్టలకు పర్యాటక హంగులు

ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గుట్టలను అటవీశాఖ సహకారంతో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చాహత్ బాజ్ పాయ్ తెలిపారు. ధర్మసాగర్ జలాశయం, అటవీ ప్రాంతంతో అనుసంధానించి గుట్టలను అభివృద్ధి చేస్తే ప్రజలకు ఆహ్లాదకరమైన పర్యాటక ప్రదేశం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. గతంలో రూపొందించిన ప్రతిపాదనలను పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని, పనుల్లో వేగం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ పూర్తయిందని చెప్పారు. అయితే కొన్ని ప్రాంతాల్లో నీటి వసతి, డ్రైనేజీ సమస్యలను లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకొస్తున్నారని తెలిపారు. అంబేద్కర్‌నగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కార్పొరేషన్ అధికారులు టెండర్లు పిలిచారని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కేటాయించిన ఇళ్లలో లబ్ధిదారులు నివసిస్తున్నారా లేదా అనే అంశంపై ఆక్యుపెన్సీ పరిశీలన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బయోమైనింగ్, పారిశుధ్యానికి ప్రాధాన్యం



నగర పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చాహత్ బాజ్‌పేయి తెలిపారు. చెత్తను ఒకేచోట డంపింగ్ చేయడం కంటే బయోమైనింగ్, బయో సీఎన్‌జీ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరిచి వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించడమే లక్ష్యమన్నారు. కొత్త డంపింగ్ యార్డు కోసం అన్వేషణ కంటే అందుబాటులో ఉన్న వ్యవస్థను సమర్థంగా వినియోగించడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

అర్హులైన ఓటర్ల పేర్లు తొలగకుండా చర్యలు

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. బూత్ స్థాయి అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. ప్రతి అర్హుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, సవరణలు అవసరమైతే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఐపీఎస్ లక్ష్యంతో సివిల్స్‌లోకి

తన వ్యక్తిగత ప్రస్థానాన్ని కూడా చాహత్ బాజ్‌పేయి ఈ సందర్భంగా వివరించారు. మధ్యప్రదేశ్‌లోని గుణలో పదో తరగతి వరకు, గ్వాలియర్‌లో ఇంటర్ విద్యను పూర్తి చేసినట్లు తెలిపారు. 2016లో ఐఐటీ కాన్పూర్‌లో విద్యుత్ ఇంజనీరింగ్ పూర్తి చేశానన్నారు. తన తండ్రి ప్రభుత్వ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేశారని, ఉన్నతాధికారులతో ఆయనకు ఉన్న పరిచయాలు, పరిపాలనా బాధ్యతలపై ఆయన చెప్పిన విషయాలు తనపై ప్రభావం చూపాయని తెలిపారు. ప్రజలకు విస్తృతంగా సేవ చేసే అవకాశం సివిల్ సర్వీసుల్లో ఉంటుందని భావించి ఆ దిశగా అడుగులు వేశానన్నారు. ఇంజనీరింగ్ చివరి సంవత్సరంలోనే తొలిసారి సివిల్స్ పరీక్ష రాశానని, మూడో ప్రయత్నంలో విజయం సాధించానని చెప్పారు. సివిల్స్ శిక్షణ సమయంలోనే వరుణ్ రెడ్డితో పరిచయం ఏర్పడిందని తెలిపారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఘనంగా దాసి రాందేవ్ జన్మదిన వేడుకలు

- ప్రజా సేవలో మరింతగా రాణించాలి : కాంగ్రెస్ నాయకుల ఆకాంక్ష

వరంగల్ తూర్పు, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని 40వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దాసి రాందేవ్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వెంకట్రామ జంక్షన్ సమీపంలోని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, మాజీ కార్పొరేటర్ గుండేటి నరేందర్, వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్ ఆధ్వర్యంలో దాసి రాందేవ్‌ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజా సేవలో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కమలుద్దీన్, మహమూద్ పాషా, ఇట్యాల



సతీష్, మీర్జా అజామ్ అలీ, సాధిక్, శ్రీపాద సతీష్, నాంపల్లి యాదగిరి తదితరులు పాల్గొని దాసి రాందేవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

చింతగట్టులో ఘనంగా ఇంజినీర్ల దినోత్సవ వేడుకలు

- విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయం
- దేశాభివృద్ధికి ఇంజినీర్లు అంకిత భావంతో పనిచేయాలి: ఈఓ ప్రసాద్

హనుమకొండ, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని చింతగట్టులో ఇంజినీర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఇంజినీరింగ్ కార్యనిర్వహణ అధికారి ప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈఓ ప్రసాద్ మాట్లాడుతూ.. విశ్వేశ్వరయ్య తన అపారమైన ఇంజినీరింగ్ నైపుణ్యంతో దేశవ్యాప్తంగా అనేక కీలక తాగునీరు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి విశేష సేవలందించారని కొనియాడారు. సాంకేతిక రంగంలో దేశ ప్రగతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. నేటి తరం ఇంజినీర్లు విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ,



పనిపట్ల అంకితభావం, దూరదృష్టిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ దేశాభివృద్ధి, సమాజ శ్రేయస్సు కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఇంజినీర్లు, స్థానికులు పాల్గొని విశ్వేశ్వరయ్య సేవలను స్మరించుకున్నారు.

గురుకులంలో కుళ్లిన కూరగాయలతో వంటలా..?

- ప్రశ్నించిన పేరెంట్స్ కమిటీపై మెస్ ఇన్‌ఛార్జ్, ప్రిన్సిపాల్ దురుసు వైఖరి
- బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్.. తల్లిదండ్రులతో ఆందోళనకు హెచ్చరిక

మల్లంపల్లి (ములుగు), సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): మల్లంపల్లిలోని ఏటూరునాగారం తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలురు)లో విద్యార్థులకు కుళ్లిపోయిన కూరగాయలతో భోజనం వడ్డిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని పాఠశాల పేరెంట్స్ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ అర్షం రాజ్‌కుమార్ పాఠశాలలోని వంటగది, భోజనశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా కుళ్లిపోయిన క్యాబేజీ, చిక్కుడుకాయలు, టమాటాలు కనిపించాయని కమిటీ తెలిపింది. పనికిరాని స్థితిలో ఉన్న చిక్కుడుకాయలను విద్యార్థులతోనే శుభ్రం చేయిస్తూ, వాటితోనే వంటలు చేస్తున్నట్లు తాను ప్రత్యక్షంగా గమనించానని చైర్మన్ పేర్కొన్నట్లు కమిటీ తెలిపింది.





పాఠశాలలో విద్యార్థులకు కనీస తాగునీటి సౌకర్యం కూడా సక్రమంగా లేదని పేరెంట్స్ కమిటీ ఆరోపించింది. మరుగు దొడ్ల సదుపాయాలు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది. నీటి కోసం బకెట్లతో వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుతున్న గురుకులంలో భోజనం నాణ్యత, పరిశుభ్రతతో పాటు కనీస సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రశ్నిస్తే.. దురుసు సమాధానాలా?

కుళ్లిపోయిన కూరగాయల వినియోగంపై ప్రశ్నించగా మెస్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్ దురుసుగా వ్యవహరించారని పేరెంట్స్ కమిటీ ఆరోపించింది. పాఠశాలను తనిఖీ చేసే అధికారం తమకు లేదంటూ అవమానించేలా మాట్లాడారని పేర్కొంది. పేరెంట్స్ కమిటీగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల భోజన నాణ్యతపై ప్రశ్నించే హక్కును కూడా ప్రశ్నించారని ఆరోపించింది. ఇదే సమయంలో పాఠశాల ప్రిన్సిపాల్ కూడా మెస్ ఇన్‌ఛార్జ్‌కు మద్దతుగా మాట్లాడుతూ, పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయడాన్ని తప్పుబట్టారని కమిటీ ఆరోపించింది. విద్యార్థుల ఆరోగ్యం, భోజన నాణ్యత వంటి అంశాలపై పర్యవేక్షణ ఉండాల్సిన చోట బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

కనీస సదుపాయాలు కూడా లేవంటున్న తల్లిదండ్రులు

అధికారుల జోక్యానికి డిమాండ్

కుళ్లిపోయిన కూరగాయల వినియోగం, విద్యార్థులతో వాటిని శుభ్రం చేయించడం, పాఠశాలలోని సదుపాయాల కొరత తదితర ఆరోపణలపై ఉన్నతాధికారులు వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని పేరెంట్స్ కమిటీ డిమాండ్ చేసింది. మెస్ ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుని తక్షణమే సస్పెండ్ చేయాలని జోనల్ అధికారి, ములుగు జిల్లా సంక్షేమ అధికారిని కోరింది. అధికారులు స్పందించకపోతే తల్లిదండ్రులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేరెంట్స్ కమిటీ హెచ్చరించింది. విద్యార్థుల ఆరోగ్య భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారు

కాకతీయుల కాలం నాటి విగ్రహంతో కార్యసిద్ధి గణపతి ఆలయ నిర్మాణం

-బక్కివాడలో ప్రత్యేక పూజలు నిర్వహించిన గ్రామస్తులు

వరంగల్, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): రంగసాయిపేట 42వ డివిజన్ బక్కివాడలోని శ్రీ కార్యసిద్ధి గణపతి ఆలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాకతీయుల కాలం నాటి పురాతన గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయ నిర్మాణాన్ని ప్రారంభించగా, ప్రస్తుతం ఆలయ నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో దామర కొండ కరుణాకర్, తోట సదానందం, తోట రాజు, ఆరే కార్తిక్, ఇమ్మడిశెట్టి కిషన్, బక్కి వంశీ, ముత్తినేని సర్వేశ్వర్, బక్కి రాజమౌళి, ఆరే రవీందర్, గుర్రాల వీరేశం, ఇట్టబోయిన కొమురయ్య, కత్తెరపల్లి



వేణు, ముత్తినేని విజయ్ చందర్, మునుకుంట్ల యాదగిరి, శ్రీను తదితరులతో పాటు గ్రామస్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాలు నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంజనీర్ల సేవలు దేశ అభివృద్ధికి కీలకం

- మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఘన నివాళి
- జడ్పీ కార్యాలయ నూతన భవనానికి నిధులు మంజూరు చేయించేలా కృషి





హనుమకొండ, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల సేవలు అత్యంత కీలకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడంలో ఇంజనీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ప్రజాప్రతినిధుల కార్యాలయంలో నిర్వహించిన ఇంజనీర్ల దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ నిర్మాణంలో విశ్వేశ్వరయ్య అందించిన సేవలు, ఇంజనీరింగ్ రంగానికి చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. రహదారులు, మురుగు నీటి పారుదల వ్యవస్థ, తాగునీటి వసతులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

జడ్పీ కార్యాలయానికి కొత్త భవనం

హనుమకొండ జిల్లా ప్రజాప్రతినిధుల కార్యాలయ పరిధిలోని జడ్పీ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన నాయిని రాజేందర్ రెడ్డి.. జడ్పీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, నిధులు కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆధునిక సౌకర్యాలతో కొత్త కార్యాలయ భవనం నిర్మించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

ఆర్ట్స్ కాలేజ్, కాకతీయ విశ్వవిద్యాలయానికి నిధుల కోసం కృషి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చే నెలలో హనుమకొండ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో చారిత్రక ఆర్ట్స్ కాలేజ్‌తో పాటు కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన నిధుల అంశాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు. వరంగల్ నగర విద్యా, సాంస్కృతిక, చారిత్రక ప్రాధాన్యతను మరింత పెంచేలా ఆర్ట్స్ కాలేజ్, కాకతీయ విశ్వవిద్యాలయంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తానని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఈ.వి. శ్రీనివాస్ రావుతో పాటు స్థానిక ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఎర్ర జెండానే అండ

- ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం: సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి



హనుమకొండ, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): పేద, మధ్యతరగతి ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఎర్రజెండా నిరంతరం అండగా నిలుస్తుందని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల గుడి సమీపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పరిశీలిస్తే కమ్యూనిస్టుల త్యాగాలు, పోరాటాలు స్పష్టంగా కనిపిస్తాయని అన్నారు. నాటి భూస్వామ్య, నిజాం వ్యతిరేక పోరాటం నుంచి నేటి వరకు కమ్యూనిస్టులు పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్నారని తెలిపారు. నిరుపేదల భూమి, ఇల్లు, ఉపాధి, సంక్షేమ హక్కుల సాధన కోసం ఎర్రజెండా నిరంతరం పోరాడుతుందని ప్రభాకర్ రెడ్డి అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వాటికి పరిష్కారం లభించే వరకు పోరాటాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. పేదలు, మధ్యతరగతి ప్రజల హక్కుల కోసం భవిష్యత్తులోనూ నిరంతరం ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పశుసంపద వివరాల నమోదును వేగవంతం చేయాలి

- జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్ లక్ష్యాలను వందశాతం సాధించాలి
- పశువుల నమోదు, టీకాలు, ఆధార్ అనుసంధానం, పశువైద్య శాలల మ్యాపింగ్‌పై కలెక్టర్ సమీక్ష



హనుమకొండ, సెప్టెంబర్15: (నిత్యం నిఘా ప్రతినిధి): జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్‌లో భాగంగా ప్రభుత్వ నిర్దేశించిన విధంగా పశుసంపదకు సంబంధించిన సమగ్ర వివరాలను నమోదు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పేయి అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ద్వారా పశుపోషకులు, రైతులకు అందాల్సిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో చేరాలంటే నిర్దేశిత లక్ష్యాలను వందశాతం సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్ అమలు తీరుపై పశుసంవర్ధక శాఖ అధికారులు, కార్యక్రమాల అమలు కమిటీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో పశుసంవర్ధక రంగానికి సంబంధించిన వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు, నిర్దేశిత లక్ష్యాల సాధనపై అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్‌లో భాగంగా పశువుల నమోదు, టీకాల కార్యక్రమం, రైతుల ఆధార్ అనుసంధానం, పశువైద్యశాలల మ్యాపింగ్ తదితర అంశాలపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న వివరాల నమోదును వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు, ఇతర సహాయ సహకారాలు అర్హులైన రైతులకు పూర్తి స్థాయిలో అందేలా సమాచార నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయంతో క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రాధాకిషన్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, విజయ డెయిరీ డీడీ ధనరాజ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజేష్, పశువైద్యాధికారి డాక్టర్ గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఫర్టిలైజర్ యాప్‌పై అవగాహన

-ఏడు రకాల వరి విత్తనాల వినియోగంపై వ్యవసాయ అధికారుల సూచనలు





ములుగు జిల్లా /తాడ్వాయి, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు ఏఈఓలు దుర్గాప్రసాద్, సందీప్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫర్టిలైజర్ యాప్ వినియోగంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై యాప్‌లో లాగిన్ ఎలా ఓపెన్ చేయాలి, యూరియా, డీఏపీ, 20:20, పొటాషియం తదితర ఎరువులను రైతులు ఎలా బుకింగ్ చేసుకోవాలనే అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. అదేవిధంగా ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి విత్తనాల వినియోగంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన విత్తనాలను వినియోగించడం ద్వారా రైతులకు వచ్చే బోనస్‌కు అర్హత లభిస్తుందని తెలిపారు. ఈ విత్తనాలకు అధిక రోగనిరోధక శక్తి ఉండటంతో పాటు పంట దిగుబడి పెరిగి రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ప్రతి రైతు ఆర్మా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని అధికారులు సూచించారు. ఆర్మా రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు రైతులు అర్హులుగా గుర్తించబడతారని తెలిపారు. భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, వారి భూమిపై పూర్తి భరోసా ఉండేందుకు రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ అవగాహన సదస్సులో ఏఈఓలు దుర్గాప్రసాద్, సందీప్‌తో పాటు మండలంలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హమార ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేయాలి

- కల్పిత నాయకుడు' పుస్తక ఆవిష్కరణను నిలిపివేయాలని డిమాండ్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని దళిత ప్రజా సంఘాల నిరసన



హనుమకొండ, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న హమార ప్రసాద్‌ను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆయన రచించినట్లు పేర్కొంటున్న 'కల్పిత నాయకుడు' పుస్తక ఆవిష్కరణను నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మంగళవారం హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బండి అశోక్, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, డిబిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్, చుంచు రాజేందర్, బండి అశోక్, మాదాసి సురేష్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను ప్రపంచవ్యాప్తంగా మేధావిగా, సామాజిక సంస్కర్తగా గౌరవిస్తుంటే ఆయనపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఈ నెల 18న జరగనున్నట్లు పేర్కొంటున్న 'కల్పిత నాయకుడు' పుస్తక ఆవిష్కరణను నిలిపివేయాలని, పుస్తకంలోని అంశాలపై సమగ్రంగా పరిశీలన జరిపించాలని వారు డిమాండ్ చేశారు. హమార ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, తమ డిమాండ్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర నాయకుడు డాక్టర్ పెరమాండ్ల రామకృష్ణ, రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, మాజీ కార్పొరేటర్ జొరిక రమేష్, కేయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ మంద వీరస్వామి, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకుడు సింగారపు రవి ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ అరూరి సాంబయ్యతో పాటు పలువురు దళిత, సామాజిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఉద్యమకారుల హక్కుల సాధనకు ఓదార్పు యాత్ర

- సెప్టెంబర్ 17న వరంగల్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఓదార్పు యాత్ర
- ఉద్యమకారులను గుర్తించి అధికారికంగా ప్రకటించాలి: మిర్జా అంజాద్



హనుమకొండ, సెప్టెంబర్ 15: నిత్యం నిఘా ప్రతినిధి : ఇతెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడి త్యాగాలు చేసిన ఉద్యమకారులను ప్రభుత్వం తక్షణమే గుర్తించి అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి మిర్జా అంజాద్ డిమాండ్ చేశారు. ఉద్యమకారుల హక్కుల సాధనతో పాటు వారి కుటుంబాలకు భరోసా కల్పించేందుకు సెప్టెంబర్ 17న వరంగల్‌లో ఓదార్పు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక నాయకులు గోపనబోయిన రాజు ఆధ్వర్యంలో నిర్వహించనున్న తొలి దశ ఓదార్పు యాత్రకు సంబంధించిన గోడపత్రికను మంగళవారం సాయంత్రం 4 గంటలకు మడికొండ చౌరస్తాలో ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది, ఉద్యమ నేత గుడిమళ్ల రవికుమార్ ఆధ్వర్యంలో ఈ యాత్ర చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా మిర్జా అంజాద్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపినవారు, కేసులు ఎదుర్కొన్న వారితో పాటు పోలీసు రికార్డుల్లో పేర్లు లేని క్రియాశీలక ఉద్యమకారులను కూడా గుర్తించాలని కోరారు. ప్రజా సాక్ష్యాలు, ఉద్యమ సంఘాల నివేదికలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన ఉద్యమకారులకు అధికారిక గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం పోరాడి నేటికీ నిర్లక్ష్యానికి గురవుతున్న ప్రతి ఉద్యమకారుడి కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు వారి హక్కులను సాధించేందుకు ఓదార్పు యాత్ర చేపడుతున్నామని ఆయన తెలిపారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజాసంఘాలు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజాస్వామికవాదులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 17న నిర్వహించనున్న ఓదార్పు యాత్రను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బైరి కొమురయ్య, మేకల రవీందర్, మొగుసాల దేవేందర్ రెడ్డి, జినుకల లక్ష్మణరావు, ఇమ్మడిశెట్టి రాజు, దార సూరి, బరిగల కృష్ణమూర్తి, బొల్లికొండ వినోద్, మధుసూదన్ రాజు, సౌరం స్వర్ణలత, గుంటి పద్మ, బుర్ర రమేష్, లింగాల సతీష్, మొండెం ముకుందం, జిట్టా రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కాటాపురంలో గణపయ్య విగ్రహానికి శివప్రసాద్ విరాళం

- పుట్టిన ఊరిపై మమకారంతో వినాయక విగ్రహం ప్రతిష్ఠించిన దంపతులు
- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ



తాడ్వాయి/కాటాపురం, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి) ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాటాపురం గ్రామ పాత బస్టాండ్‌లో తొలిసారిగా నవరాత్రుల సందర్భంగా వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పుట్టి పెరిగిన గ్రామంపై ఉన్న మమకారంతో పట్టణంలో నివసిస్తున్న గుండా శివప్రసాద్–అనసూయ దంపతులు గణపతి విగ్రహాన్ని విరాళంగా అందించి ప్రతిష్ఠాపనకు సహకరించారు. గతంలో గ్రామంలోని ప్రజలంతా పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్దకు చేరుకుని పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించేవారు. గ్రామం అభివృద్ధి చెందడంతో వివిధ వీధుల్లో ఆయా ప్రాంతాల ప్రజలు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించడంతో పాత బస్టాండ్‌లోని విగ్రహానికి ప్రాధాన్యత తగ్గింది. ఈ నేపథ్యంలో శివప్రసాద్ దంపతులు ముందుకు వచ్చి విగ్రహాన్ని విరాళంగా అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. కాటాపురం తన పుట్టి పెరిగిన గ్రామమని, గ్రామంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. పిల్లల చదువులు, ఉద్యోగాల కారణంగా గ్రామాన్ని విడిచి పట్టణంలో నివసిస్తున్నప్పటికీ తమ మూలాలు మాత్రం కాటాపురంలోనే ఉన్నాయని అన్నారు. గ్రామ ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. కుటుంబ సమేతంగా పూజారి ఆధ్వర్యంలో గణపతికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించి భక్తులకు పంపిణీ చేశారు. శివప్రసాద్ దంపతులు గతంలోనూ అయ్యప్ప మాలధారణ సమయంలో భక్తులకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ తమ వంతు సహకారం అందించారని గ్రామస్తులు గుర్తు చేశారు. కార్యక్రమంలో విగ్రహ దాత గుండా శివప్రసాద్–అనసూయ దంపతులు, గాదె అమృతాచారి–రమాదేవి దంపతులు, వినాయక కమిటీ అధ్యక్షుడు రాము, కోశాధికారి బెల్లంకొండ నరేష్, ప్రధాన కార్యదర్శి మెడిశెట్టి మహేష్, సహాయ కార్యదర్శి మహిపతి చరణ్, ఆదిత్య, అన్నాల శరత్, అల్లే వెంకటేశ్వర్లు దంపతులు, ఆనందం–జయమ్మ దంపతులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పోలీసుల విధుల్లో నిర్లక్ష్యం..
బస్టాండ్ ఏరియాలో ట్రాఫిక్ గందరగోళం!

- ట్రాఫిక్ కంట్రోల్ చేయాల్సిన పోలీసులే... ట్రాఫిక్‌లో కనిపించకుండా పోయారా?
- బస్టాండ్ పరిసరాల్లో రోడ్డుపైనే ప్రైవేట్ వాహనాల నిలుపుదల.. ప్రయాణికుల ఎక్కింపు
- విధుల్లో ఉన్న సిబ్బంది సరదాగా గడుపుతున్నారనే ఆరోపణలు..
  నిబంధనలు సామాన్యులకేనా? అంటూ ప్రజల ప్రశ్న





హనుమకొండ, సెప్టెంబర్ 15: నిత్యం నిఘా ప్రతినిధి

హనుమకొండ బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ప్రాంతంలో రోడ్డుపైనే ప్రైవేట్ వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాల రాకపోకలకు తరచూ అంతరాయం ఏర్పడుతోందని ప్రయాణికులు, స్థానికులు చెబుతున్నారు.

రోడ్డుపైనే ప్రయాణికుల ఎక్కింపు

బస్టాండ్ చుట్టుపక్కల ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణికులను తరలించే కొన్ని ప్రైవేట్ వాహనాలు బస్టాండ్ వెలుపల ప్రధాన రహదారి పక్కనే, కొన్నిసార్లు రోడ్డుపైనే నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఒక వాహనం ఆగడం.. దాని వెనుక మరో వాహనం నిలవడం.. ఇలా వాహనాల సంఖ్య పెరగడంతో రద్దీ మరింత తీవ్రమవుతోందని స్థానికులు అంటున్నారు.

— దీంతో ఆర్టీసీ బస్సులు సైతం సులభంగా వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

సామాన్యుడికి చలానా.. ప్రైవేట్ వాహనాలకు మినహాయింపా?

నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలిపినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా సాధారణ వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటుంటారు. అయితే బస్టాండ్ వంటి అత్యంత రద్దీ ప్రాంతంలో రోడ్డుపైనే వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నప్పుడు సంబంధిత వాహనాలపై చర్యలు ఎందుకు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

— నిబంధనలు అందరికీ సమానమా? లేక సామాన్య వాహనదారుడికే పరిమితమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

విధుల్లో ఉన్న సిబ్బంది ఏం చేస్తున్నారు?

ట్రాఫిక్ నిర్వహణపై విమర్శలకు తోడు కొన్ని దృశ్యాలు కూడా చర్చనీయాంశంగా మారాయి. విధులు నిర్వహించాల్సిన సమయంలో కొందరు ట్రాఫిక్ సిబ్బంది ఆటో డ్రైవర్లతో కలిసి సరదాగా గడుపుతున్నట్లు కనిపించే దృశ్యాలు కెమెరాకు చిక్కినట్లు ప్రచారం జరుగుతోంది. ఆకులతో బొమ్మలు తయారు చేస్తూ ఆటో డ్రైవర్లతో కలిసి సరదాగా గడుపుతున్నట్లు కనిపించే ఈ దృశ్యాలపై ప్రజల్లో చర్చ మొదలైంది. అయితే ఆ దృశ్యాలు ఎప్పుడు, ఏ సందర్భంలో చిత్రీకరించబడ్డాయి? సిబ్బంది ఆ సమయంలో అధికారిక విధుల్లో ఉన్నారా? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

రద్దీ వేళల్లో ఫోన్లు.. ఆటోల్లో కూర్చోవడంపై ఆరోపణలు

బస్టాండ్ పరిసరాల్లో రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో కొందరు సిబ్బంది విధుల్లో ఉన్నప్పటికీ ఫోన్లలో మాట్లాడటం, ఆటోల్లో కూర్చోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన సిబ్బందే వాహనాల కదలికలను పర్యవేక్షించకపోతే రద్దీని నియంత్రించేది ఎవరు? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బస్టాండ్ పరిసరాల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ట్రాఫిక్ అంతరాయానికి దారితీసే అవకాశం ఉందని ప్రయాణికులు అంటున్నారు.

ఆర్టీసీకి ఇబ్బంది.. ప్రయాణికులకు అవస్థలు

ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల ట్రాఫిక్‌తో పాటు ఆర్టీసీ బస్సుల రాకపోకలపైనా ప్రభావం పడుతోందని పలువురు చెబుతున్నారు. ప్రైవేట్ వాహనాలకు నిర్దేశిత పార్కింగ్ లేదా ప్రయాణికుల ఎక్కింపు కేంద్రాలు ఉన్నాయా? రోడ్డుపైనే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అనుమతి ఉందా? నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే విషయాలను అధికారులు స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యవేక్షణ ఎక్కడ?

ట్రాఫిక్ నిబంధనలు అమలు చేయడం ఎంత ముఖ్యమో.. విధుల్లో ఉన్న సిబ్బంది తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నారా లేదా అన్నది పర్యవేక్షించడం కూడా అంతే ముఖ్యం. హనుమకొండ బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ, ప్రైవేట్ వాహనాల నిలుపుదల, ప్రయాణికుల ఎక్కింపు వంటి అంశాలపై ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని ప్రజలు కోరుతున్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరుపైనా సమీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నిబంధనలు చెప్పే పోలీసులే.. అమలు చేయకపోతే?

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు నిరంతరం అవగాహన కల్పిస్తుంటారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చలానాలు విధిస్తారు. మరి రద్దీ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ప్రైవేట్ వాహనాల విషయంలోనూ అదే స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారా? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న. సామాన్యులకు ఒక నిబంధన.. ప్రైవేట్ వాహనదారులకు మరో నిబంధనా?
విధుల్లో ఉన్న ప్రతి సిబ్బంది బాధ్యతగా వ్యవహరిస్తున్నారా?
బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ నియంత్రణను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం లేదా?

ఈ ప్రశ్నలకు ట్రాఫిక్ ఉన్నతాధికారుల నుంచి సమాధానం రావాల్సి ఉంది.

ఉన్నతాధికారులు స్పందించాలి

బస్టాండ్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. రోడ్డుపైనే వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునే పరిస్థితులకు అడ్డుకట్ట వేయడంతో పాటు అవసరమైతే ప్రత్యేక ఎక్కింపు, దింపే ప్రాంతాలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

అదే సమయంలో విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరును ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కోరుతున్నారు.
ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులే ట్రాఫిక్‌లో కనిపించకుండా పోయారనే విమర్శలకు చెక్ పడుతుందా?
రోడ్డుపైనే వాహనాలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారనే ఆరోపణలపై చర్యలు ఉంటాయా? విధుల్లో ఉన్న సిబ్బంది సరదాగా గడుపుతున్నట్లు కనిపించే దృశ్యాలపై అధికారులు ఏం చెబుతారు?
సామాన్యులు, ప్రైవేట్ వాహనదారులకు నిబంధనలు ఒకే విధంగా అమలవుతాయా?

హనుమకొండ ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు ఈ ప్రశ్నలకు ఎలాంటి సమాధానం ఇస్తారో వేచి చూడాలి.

డీజే మోతతో ప్రజలకు ఇబ్బందులు వద్దు..!

- భక్తి పేరుతో హద్దులు దాటితే సహించేది లేదు..
  ప్రజల ఇబ్బందులపై పోలీసుల దృష్టి
- నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో
  నిమజ్జనాలు నిర్వహించాలి : సీఐ వై. సంజీవరావు



వరంగల్ / వర్ధన్నపేట, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): గణనాథుని నిమజ్జన ఊరేగింపు అంటే భక్తి, ఆనందం, ఆధ్యాత్మికతకు ప్రతీక. అయితే ఇదే వేడుకలో డీజే శబ్దం హద్దులు దాటి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే పరిస్థితి ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్‌ల వినియోగంతో వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రహదారులపై భారీ శబ్దాలతో ఊరేగింపులు సాగితే ట్రాఫిక్‌కు కూడా అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భక్తి కార్యక్రమం పేరుతో ప్రజల ప్రశాంతతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.
"గణపతి నిమజ్జన ఊరేగింపులో డీజే శబ్దం ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉండకూడదు. భక్తి భావనతో కార్యక్రమాన్ని నిర్వహించాలి. ఇతరులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించకూడదు" అని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. సంజీవరావు సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించుకోవడంలో ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే శాంతిభద్రతలు, ప్రజల సౌకర్యం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

భక్తి కావాలి.. బీభత్సం కాదు!

గణనాథుడి నిమజ్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో సాగాలని ప్రజలు కోరుకుంటున్నారు. డీజే మోతను తగ్గించడం వల్ల భక్తి తగ్గదని, అదే సమయంలో ప్రజలకు కలిగే ఇబ్బందులు తగ్గుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సుబేదారి వద్ద చెట్టుకు ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

- అటవీ శాఖ కార్యాలయం సమీపంలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



హన్మకొండ, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండ నగరంలోని సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. అటవీ శాఖ కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారి డివైడర్‌లో ఉన్న చెట్టుకు ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4:30 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. రహదారి డివైడర్ మధ్యలో చెట్ల పొదలు ఉండటంతో ఘటనను తొలుత ఎవరూ గుర్తించలేకపోయారు. ఉదయం సమయంలో స్థానికులు, వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సుబేదారి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు, అతడు ఎక్కడి నుంచి వచ్చాడనే విషయాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు ఏమిటన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఘటనా స్థలంలో ఏమైనా ఆధారాలు లభించాయా అనే అంశంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహంకాళి వీధిలో శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన

వరంగల్, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): నగరంలోని 42వ డివిజన్ పరిధిలోని మహంకాళి వీధిలో శ్రీ లక్ష్మీ గణపతి పరపతి సంఘం ఆధ్వర్యంలో గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘం ఆధ్వర్యంలో, శ్రీ వెలిది ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలుగా శంకేసి రాజేష్–కరుణశ్రీ దంపతులు పాల్గొని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘ కమిటీ సభ్యులు విలాసం విశ్వనాథం, పాల నాగరాజు, కుమ్మరి కృష్ణమూర్తి, అంబటి రమేష్, పెందుట సోమరాజు, కత్తెనపల్లి శ్రీనివాస్, పాల రంజిత్, ముప్పరాజు కేదల అశ్విన్‌తో పాటు కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

పంతినిలో గౌడ కమిటీకి ఏకగ్రీవ పట్టాభిషేకం!

- ఐక్యతే లక్ష్యంగా నూతన కమిటీ ఏర్పాటు..
  సంఘం అభివృద్ధికి సమష్టిగా కృషి



హనుమకొండ / ఐనవోలు, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): పంతిని గ్రామంలో గౌడ సంఘానికి నూతన కమిటీ కొలువుదీరింది. గ్రామానికి చెందిన గౌడ పెద్దమనుషుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో గ్రామంలోని గౌడ సంఘం ఐక్యతకు మరింత బలం చేకూరిందని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గౌడ సంఘం భవిష్యత్ కార్యాచరణ, సంఘం బలోపేతం, గ్రామంలోని గౌడల మధ్య ఐక్యత, సభ్యుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు.

నూతన కమిటీ వివరాలు

కమిటీ పెద్దమనుషులు:
మడూరి కుమారస్వామి, బండి రమేష్ గౌడ్
సర్పంచ్:సమ్మెట సమ్మయ్య
ఉపాధ్యక్షుడు:బండి కుమారస్వామి
కార్యదర్శి:మడూరి లక్ష్మణ్
కమిటీ సభ్యులు:
సట్ల సోమన్న, సట్ల అశోక్, బండి వేణు, చిర్ర శ్రీధర్, మడూరి రాజు, చిన్నబత్తిని సమ్మయ్య. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గౌడ సంఘం అభివృద్ధితో పాటు గ్రామంలోని గౌడల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. సంఘ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముందుండి పనిచేస్తామని స్పష్టం చేశారు. పంతినిలో గౌడ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో గ్రామంలో సందడి నెలకొంది. నూతన కమిటీ సభ్యులకు గౌడ సంఘం పెద్దలు, సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి

- బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు



వరంగల్, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన, మరుపురాని చారిత్రక ఘట్టమని, నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనమైన ఈ రోజును "తెలంగాణ విమోచన దినోత్సవం"గా అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు సూచనల మేరకు, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్ అధ్యక్షతన వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని చౌరస్తా కె. కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సమావేశానికి ప్రదీప్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం కావడం తెలంగాణ చరిత్రలో కీలక మలుపు అని అన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దమనకాండకు వ్యతిరేకంగా జాతీయవాదులు, స్వాతంత్ర్య సమరయోధులు, సామాన్య ప్రజలు సాగించిన పోరాటాలు, చేసిన త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం రెండింటినీ ఒకే చరిత్రగా చిత్రీకరించడం సరికాదని ప్రదీప్ రావు స్పష్టం చేశారు. ఈ రెండు ఉద్యమాలకు వేర్వేరు లక్ష్యాలు, రాజకీయ నేపథ్యాలు, కాలపరిమితులు ఉన్నాయని తెలిపారు. సెప్టెంబర్ 17న నిజాం పాలన ముగిసి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం కాగా, తెలంగాణ సాయుధ పోరాటం ఆ తర్వాత కూడా కొనసాగిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరించకూడదని, పేర్లు మార్చినంత మాత్రాన చరిత్ర మారదని అన్నారు. తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాటాల చరిత్రను రాజకీయాలకు అతీతంగా వాస్తవ ఆధారాలతో నేటి తరానికి తెలియజేయాలని కోరారు. పరకాల, భైరాన్‌పల్లి వంటి చారిత్రక ఘటనలను పాఠ్యాంశాల్లో చేర్చి యువతకు అవగాహన కల్పించాలని, నిజాం, రజాకార్ల నిరంకుశ త్వానికి వ్యతిరేకంగా పోరాడిన వీరుల త్యాగాలను అధికారికంగా స్మరించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ ప్రధాన డిమాండ్లు

– సెప్టెంబర్ 17ను "తెలంగాణ విమోచన దినోత్సవం"గా అధికారికంగా నిర్వహించాలి.
–హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలను వేర్వేరుగా పాఠ్యాంశాల్లో చేర్చాలి.
– పరకాల, భైరాన్‌పల్లి వంటి చారిత్రక ఘటనలను యువతకు తెలియజేయాలి.
–విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన వీరులను అధికారికంగా స్మరించాలి.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, సిద్ధం నరేష్, రత్నం సతీష్ షా, జలగం రంజిత్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా కార్యదర్శి పొనుగోటి వెంకట్ రావు, ఐటీ ఇంచార్జి ఆడెపు వెంకటేష్, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థినుల భద్రతే షీ టీం లక్ష్యం

- సోషల్ మీడియా పరిచయాలపై అప్రమత్తంగా ఉండాలి
- వేధింపులు ఎదురైతే భయపడొద్దు..
  వెంటనే పోలీసులను ఆశ్రయించాలి



భూపాలపల్లి, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థినుల భద్రతకు షీ టీం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భూపాలపల్లి జిల్లా పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు మహిళలు, బాలికల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా షీ టీం సిబ్బంది మాట్లాడుతూ సోషల్ మీడియా ద్వారా పరిచయం లేని వ్యక్తులతో స్నేహాలు పెంచుకోవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలను అపరిచితులతో పంచుకోవద్దని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించి వ్యక్తిగత సమాచారం వెల్లడించవద్దని హెచ్చరించారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలు, బాలికలు ఎదుర్కొనే వేధింపుల్లో కొన్నిసార్లు పరిచయస్తుల ప్రమేయం కూడా ఉంటుందని తెలిపారు. అలాంటి పరిస్థితుల్లో ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా షీ టీంను సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. విద్యార్థినులు ప్రయాణ సమయంలో 'టి–సేఫ్' యాప్‌ను వినియోగించడం ద్వారా తమ ప్రయాణాన్ని మరింత సురక్షితంగా చేసుకోవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అనుమానాస్పద లింకులు, క్యూఆర్ కోడ్‌లు, APK ఫైళ్లను తెరవకూడదని, అపరిచితుల నుంచి వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాలికలకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే షీ టీం 8712658162, అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 సైబర్ నేరాల టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు.అలాగే మంచి స్పర్శ–చెడు స్పర్శ, పోక్సో చట్టం, మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై నిజ జీవిత సంఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సంప్రదాయ నృత్యకళకు పన్నెండేళ్ల ప్రస్థానం

- రవీంద్రభారతిలో ఘనంగా శ్రీ చంద్ర కళా నిలయం కళాప్రస్థానం
- పేరిణి, ఆంధ్ర నాట్యంతో అలరించిన వంద మంది విద్యార్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి):
సంప్రదాయ నృత్యకళకు పన్నెండేళ్లుగా సేవలందిస్తున్న శ్రీ చంద్ర కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 'పన్నెండు వసంతాల కళాప్రస్థానం' కార్యక్రమం మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై ఘనంగా జరిగింది. సుమారు వంద మంది విద్యార్థులు పేరిణి నాట్యం, ఆంధ్ర నాట్యంలోని వివిధ నృత్యాంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కుంభహారతి, పేరిణి పాత్ర ప్రవేశం, దశరథ రామ గోవింద, బ్రహ్మ గద్య, శివ కైవరం, సంధ్యా సమయము, శబ్ద పల్లవి, సాహిత్య పల్లవి తదితర నృత్యాంశాలను అద్భుతంగా ప్రదర్శించారు. సంప్రదాయ నృత్యరీతుల వైభవాన్ని చాటేలా సాగిన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గురు–శిష్య పరంపరను ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రదర్శనలు సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కంచర్ల శ్రీనివాస్‌రావు విద్యార్థులను ఆశీర్వదించి అభినందించారు. భక్త రామదాసు పదో తరం వారసుడిగా గుర్తింపు పొందిన ఆయన విద్యార్థుల కళా ప్రతిభను ప్రశంసించారు. ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత పేరిణి రాజ్‌కుమార్, ప్రముఖ సినీ గేయ రచయిత మల్లికవల్లభ, సురభి నాటక కళాకారుడు, మేకప్ కళాకారుడు సురభి దినకర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. వివిధ నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు



అందజేసి సత్కరించారు. జనగామ, ఆలేరు, బచ్చన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ కళాప్రస్థానంలో పాల్గొన్నారు. శ్రీ చంద్ర కళా నిలయం గత పన్నెండేళ్లుగా పేరిణి నాట్యం, ఆంధ్ర నాట్యం వంటి సంప్రదాయ నృత్యకళలను విద్యార్థులకు బోధిస్తూ కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ కళలను భావితరాలకు అందించడమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గురు సంతోష్ పెరుమాండ్ల, ప్రకాశ్ సమన్వయంతో నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, కళాభిమానులు, పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళా ప్రస్థానాన్ని విజయవంతం చేశారు..

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సెప్టెంబర్ 17ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

- తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి : కొండేటి శ్రీధర్
- కొంకపాకలో అమరవీరుల స్థూపానికి నివాళులు



హనుమకొండ / పర్వతగిరి, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ విమోచన దినమైన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ డిమాండ్ చేశారు. పర్వతగిరి నుంచి కొంకపాకలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ.. నిజాం పాలనకు వ్యతిరేకంగా వేలాది మంది చేసిన త్యాగాలకు సెప్టెంబర్ 17 చారిత్రక గుర్తుగా నిలిచిందన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తున్నారని, అదే విధంగా తెలంగాణలోనూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. ప్రజలు సెప్టెంబర్ 17న జాతీయ జెండాలను ఎగురవేసి తెలంగాణ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హర్కావత్ వినోద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, యువ మోర్చా అధ్యక్షుడు గొల్లపల్లి సంతోష్ కుమార్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు అడుపరాజు, జిల్లా నాయకులు జలంధర్, చంద్రయ్య, నరసయ్య, లక్ష్మణ్, రంజిత్, మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యకళకు పన్నెండేళ్ల ప్రస్థానం

- రవీంద్రభారతిలో ఘనంగా శ్రీ చంద్ర కళా నిలయం కళాప్రస్థానం
- పేరిణి, ఆంధ్ర నాట్యంతో అలరించిన వంద మంది విద్యార్థులు

హైదరాబాద్, సెప్టెంబర్ 15, (నిత్యం నిఘా ప్రతినిధి): సంప్రదాయ నృత్యకళకు పన్నెండేళ్లుగా సేవలందిస్తున్న శ్రీ చంద్ర కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 'పన్నెండు వసంతాల కళా ప్రస్థానం' కార్యక్రమం మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ప్రధాన వేదికపై ఘనంగా జరిగింది. సుమారు వంద మంది విద్యార్థులు పేరిణి నాట్యం, ఆంధ్ర నాట్యంలోని వివిధ నృత్యాంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కుంభహారతి, పేరిణి పాత్ర ప్రవేశం, దశరథ రామ గోవింద, బ్రహ్మ గద్య, శివ కైవరం, సంధ్యా సమయము, శబ్ద పల్లవి, సాహిత్య పల్లవి తదితర నృత్యాంశాలను అద్భుతంగా ప్రదర్శించారు. సంప్రదాయ నృత్యరీతుల వైభవాన్ని చాటేలా సాగిన ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గురు–శిష్య పరంపరను ప్రతిబింబించేలా విద్యార్థుల ప్రదర్శనలు సాగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కంచర్ల శ్రీనివాస్‌రావు విద్యార్థులను ఆశీర్వదించి అభినందించారు. భక్త రామదాసు పదో తరం వారసుడిగా గుర్తింపు పొందిన ఆయన విద్యార్థుల కళా ప్రతిభను ప్రశంసించారు. ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత పేరిణి రాజ్‌కుమార్, ప్రముఖ సినీ గేయ రచయిత మల్లికవల్లభ, సురభి నాటక కళాకారుడు, మేకప్ కళాకారుడు సురభి దినకర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. వివిధ నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు అందజేసి సత్కరించారు. జనగామ, ఆలేరు, బచ్చన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ కళాప్రస్థానంలో పాల్గొన్నారు. శ్రీ చంద్ర కళా నిలయం గత



పన్నెండేళ్లుగా పేరిణి నాట్యం, ఆంధ్ర నాట్యం వంటి సంప్రదాయ నృత్యకళలను విద్యార్థులకు బోధిస్తూ కళా, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తోందని నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయ కళలను భావితరాలకు అందించడమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని గురు సంతోష్ పెరుమాండ్ల, ప్రకాశ్ సమన్వయంతో నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, కళాభిమానులు, పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాప్రస్థానాన్ని విజయవంతం చేశారు..

సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినోత్సవంగా నిర్వహించాలి

- తెలంగాణ విమోచన చరిత్రను శాశ్వతంగా పరిరక్షించాలి
- సప్త సంకల్పాలు' అమలు చేయాలి.. కలెక్టర్, తహసీల్దార్లకు బీజేపీ వినతి





వరంగల్, సెప్టెంబర్ 15 (నిత్యం నిఘా ప్రతినిధి): సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ వరంగల్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు అందించడంతో పాటు నాటి అమరవీరుల త్యాగాలను శాశ్వతంగా గుర్తుండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌కు, ఖిల్లా వరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందిన సెప్టెంబర్ 17 చారిత్రక ప్రాధాన్యాన్ని ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ఎలాంటి రాజకీయ, ఓటు బ్యాంకు లెక్కలకు తావులేకుండా ఈ రోజును అధికారికంగా విమోచన దినోత్సవంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ విమోచన చరిత్రను భవిష్యత్ తరాలకు అందించేందుకు తాము ప్రతిపాదించిన 'తెలంగాణ సప్త సంకల్పాలు'ను తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాటి పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల చరిత్ర, వారి పోరాట స్ఫూర్తిని విద్యార్థులు, యువతకు పరిచయం చేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే తరహాలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, కుసుమ సతీష్, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్, సిద్ధం నరేష్, జలగం రంజిత్, మల్లాది తిరుపతిరెడ్డి, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, బండి సాంబయ్య యాదవ్‌తో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు కనుకుంట్ల రంజిత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కందిమల్ల మహేష్, జిల్లా కార్యదర్శులు పొనుగోటి వెంకట్రావు, రాయబారపు కుమారస్వామి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కూచన క్రాంతికుమార్, సీనియర్ నాయకులు అంబాల రాంగోపాల్‌గౌడ్, రఫీ, మోరే వేణు, మాదాసు రాజు, రేణుక, శరణి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో సాగర్ జలాల విడుదల

- పంటలకు ప్రాణం పోసిన సాగునీరు.. హర్షం వ్యక్తం చేసిన బోనకల్ రైతాంగం

నిత్యం నిఘా, బోనకల్, సెప్టెంబర్ 15 : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో నాగార్జునసాగర్ నుంచి సాగునీటిని విడుదల చేయడంతో బోనకల్ మండల రైతాంగంలో హర్షం వ్యక్తమవుతోంది. బీబీసీ కాలువ ద్వారా సాగర్ జలాలు బోనకల్ మండలానికి చేరుకోవడంతో వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్న పంటలకు ఊరట లభించింది.సాగర్ జలాలు రావడంతో సాగునీటితో పాటు చెరువులు, కుంటల్లోకి నీరు చేరే అవకాశం ఏర్పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలకు సాగునీరు అందడంతో వాటిని కాపాడుకునే అవకాశం ఏర్పడిందని రైతులు తెలిపారు. పంటలు ఎండిపోతున్న సమయంలో సాగర్ నీరు విడుదల చేయడం పంటలకు ప్రాణం పోసినట్టుగా ఉందని పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను ముందుగానే గుర్తించి ప్రజా ప్రభుత్వం సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగర్ జలాలను విడుదల చేయడం అభినందనీయమని రైతులు అన్నారు. అందుబాటులోకి వచ్చిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడుకోవాలని వారు కోరారు.సాగర్ జలాలను విడుదల చేయించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బోనకల్ మండల రైతాంగం ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలిపింది.ఈ కార్యక్రమంలో బోనకల్ మండల అధ్యక్షులు



కర్నాటి రామకోటేశ్వరరావు, పైడిపల్లి కిషోర్, పిల్లలమరి నాగేశ్వరరావు, బద్రు నాయక్, యార్రంశెట్టి సుబ్బారావు, కందుల పాపారావు, గూడా నరసయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పిఎస్ రూరల్ నియోజకవర్గం ఆధ్వర్యంలో 'ఎమ్ఇఎఫ్' జాతీయ కోర్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం

నిత్యం నిఘా, నిజామాబాద్ రూరల్ డిచ్ పల్లి, సెప్టెంబర్ 15 : నిజామాబాద్ జిల్లా కేంద్రం లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (MRPS) రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ మరియు మండల ఇంచార్జ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం నాడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో పనిచేస్తున్న ఎమ్ఆర్‌పిఎస్ అనుబంధ సంఘం "మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్" (MEF) జాతీయ కార్యవర్గ కోర్ కమిటీ సభ్యులుగా నూతనంగా ఎన్నికైన నాయకులను ఘనంగా సన్మానించారు. జాతీయ కోర్ కమిటీ సభ్యులుగా నూతనంగా నియామకమైన తెడ్డు గంగారాం, ఆర్. నాంపల్లి,మరియు జాతీయ ఉపాధ్యక్షులు సురేష్ (GHM) గార్లకు సంఘం ప్రతినిధులు శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రూరల్ ఇంచార్జ్ గందమాల నాగభూషణం మాట్లాడుతూ... పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆశయ సాధనకు, ఉద్యోగ సమాజ సంక్షేమానికి మరియు ఎమ్ ఆర్ పి ఎస్ తీసుకునే అన్ని కార్యాచరణ ల్లో నూతనంగా ఎన్నికైన జాతీయ నాయకులు నిరంతరం కృషి చేయాలని తెలిపారు . బాధ్యతలు స్వీకరించిన నాయకులు సంఘ బలోపేతానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

ముందుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్,జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి, జిల్లా సీనియర్ నాయకులు సరికెళ్ల పోశెట్టి,ధర్పల్లి మండలం ఇన్చార్జి నక్క రాజేందర్, డిచ్పల్లి మండలం ఇన్చార్జి డప్పు నరసయ్య, ఇందల్వాయి మండలం ఇన్చార్జి సంగేమ్ కిష్టయ్య, రూరల్ మండలం ఇంచార్జ్ శ్రీ రాములు, సిరికొండ మండలం ఇన్చార్జి మొట్టల దీపక్, వివిధ మండలాల ఇంచార్జ్‌లు, నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com